# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 14-03-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాల మహిళలు సొంత వ్యాపారాలు చేసుకునేలా ఈ బీ సీ నేస్తం పథకం కింద ఆర్థిక సహాయం అందిస్తున్నామని ముఖ్యమంత్రి వై ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలియజేశారు.

- గిరిజన ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర తెలిపారు.

- కర్నూలు జిల్లా లక్ష్మీపురంలో నిర్మించనున్న జాతీయ న్యాయ విశ్వవిద్యాలయానికి ముఖ్యమంత్రి వై ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈరోజు భూమి పూజ నిర్వహించారు.

- విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో ఉన్నతమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి అన్నారు.

=====================================

నంద్యాల జిల్లా, బనగానపల్లెలో 22 కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మించిన 100 పడకల ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ముఖ్యమంత్రి వై ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈరోజు ఆవిష్కరించారు. అనంతరం ఆయన వైఎస్సార్ ఈబీసీ నేస్తం కింద 4 లక్షల మందికి పైగా లబ్దిదారుల ఖాతాలకు ఆర్థిక సాయాన్ని బదిలీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఓసీ సామాజిక వర్గానికి చెందిన 45 నుండి 60 ఏళ్ళ మహిళలకు ఆర్థిక సహాయం అందజేస్తున్నామని పేర్కొంటూ .....

(వాయిస్ 30 సెకన్లు)

=====================================

ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ఈరోజు పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు ఏరియా ఆసుపత్రిలో సుమారు 15 లక్షల రూపాయలు విలువచేసే సి-ఆర్మ్ మిషన్ ను ప్రారంభించారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న 100 పడకల ఆసుపత్రి అదనపు భవన నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గిరిజన ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

====================================

రాయలసీమలో... ప్రత్యేకించి కర్నూలులో న్యాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు కావడం ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుందని ముఖ్యమంత్రి వై ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కర్నూలు జిల్లా లక్ష్మీపురంలో 150 ఎకరాల విస్తీర్ణంతో ఒక వెయ్యి 11 కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మించనున్న జాతీయ న్యాయ విశ్వవిద్యాలయానికి ఈరోజు ఆయన భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాయలసీమ ప్రాంతానికి సహేతుక న్యాయం జరగాలని 87 సంవత్సరాల క్రితం శ్రీబాగ్ ఒప్పందం జరిగిందని, దాని కోసం ప్రజలు అప్పటి నుండి ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఆ ఒప్పందం ప్రకారం హైకోర్టు ఇక్కడకు రావలసి ఉందని, ఆ దిశగా ఇప్పుడు అడుగులు పడుతున్నాయని వివరించారు. ఇందులో భాగంగానే ఇక్కడ నేషనల్ లా యూనివర్సిటీకి శంకుస్థాపన చేస్తున్నట్టు ముఖ్యమంత్రి పేర్కొంటూ....

(వాయిస్ 18 సెకన్లు)

====================================

విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో ఉన్నతమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి అన్నారు. తిరుపతిలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు ఎటువంటి కష్టాలు పడ కూడదనే ఉద్దేశ్యంతో జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల తీరును మెరుగు పరచి, కార్పొరేట్ స్థాయిలో విద్యను అందిస్తున్నామని వివరించారు.

====================================

పాడేరు పట్టణంలో నిఘావ్యవస్థను పటిష్ట పరచవలసిన అవసరం ఉందని అరకు పార్లమెంట్ సభ్యురాలు జి. మాధవి అన్నారు. పాడేరు పోలీస్ టౌన్ సర్కిల్ కార్యాలయంలో 10 లక్షల రూపాయల ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన 52 సీసీ కెమేరాలు, రెండు మెగా ఎల్ఈడి స్క్రీన్ లను ఈరోజు ఆమె ఎస్పీ తుహిన్ సిన్హాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పట్టణంలో దొంగతనాలు జరుగుతూ ఉండటం, అనుమానితుల సంచారం మొదలైన కారణాలతో భద్రతా చర్యలను చేపడుతున్నట్టుగా పేర్కొన్నారు.

====================================

ఎన్నికల నియమావళిని జిల్లా వ్యాప్తంగా అమలు చేసేందుకు అధికారులంతా సిద్ధంగా ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని తహశీల్దార్లు, పోలీసు, మండల అభివృద్ధి అధికారులతో ఈరోజు ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎటువంటి ఉల్లంఘనలు జరక్కుండా ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

విరామం

====================================

జస్టిస్ బొప్పన వరాహ లక్ష్మీనర్సింహ చక్రవర్తి, జస్టిస్ తల్లాప్రగడ మల్లిఖార్జున రావులు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులుగా ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు. హైకోర్టు ప్రాంగణంలో ఈరోజు జరిగిన కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ వీరిద్దరి చేత న్యాయమూర్తులుగా ప్రమాణం చేయించారు.

====================================

విశాఖ జిల్లాలోని అన్ని న్యాయ స్థానాల్లో ఈ నెల 16వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.వి.శేషమ్మ తెలిపారు. జిల్లాలోని వివిధ న్యాయ స్థానాల్లో ఉన్న పెండింగ్

కేసులు, లోక్ అదాలత్ లో పరిష్కారానికి వస్తాయని పేర్కొన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

==================================

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈరోజు నిర్వహించిన వైఎస్సార్ ఈబీసీ నేస్తం నగదు బదిలీ కార్యక్రమంలో వివిధ జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు వర్చువల్ గా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విశాఖ జిల్లా సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్  మాట్లాడుతూ... ఈ పథకం కింద జిల్లాలోని 8 వేల 302 మంది అగ్రవర్ణాలకు చెందిన పేద మహిళల ఖాతాల్లో 12 కోట్ల 45 లక్షల రూపాయలను జమ చేసినట్లు తెలిపారు.

==================================

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలని వైఎస్సార్ కడప జిల్లా ఎస్పీ సిద్ధార్ద్ కౌశల్ విజ్ఞప్తి చేశారు. ప్రజలకు భరోసా కల్పించేందుకు కేంద్ర సాయుధ బలగాలతో కలిసి జిల్లాలోని పలు ప్రాంతాలలో పోలీసులు కవాతు నిర్వహించినట్టు పేర్కొన్నారు. ఎన్నికలలో ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేలా జిల్లా పోలీసు యంత్రాంగం ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటుందని ఎస్పీ ఈ సందర్భంగా తెలియజేశారు.

==================================

వేసవి కాలంలో సైతం కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేస్తామని రాష్ట్ర విద్యుత్, అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. ఈరోజు ఆయన చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం రొంపిచర్ల మండలంలో రెండు నూతన సబ్ స్టేషన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వేసవికాలం ప్రారంభమైన నేపథ్యంలో విద్యుత్ కోతల పట్ల ఆందోళన చెందవద్దని తెలిపారు.

==================================

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రైతు పక్షపాతి అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. చిత్తూరు జిల్లా నగరి రూరల్ మండలం అడవి కొత్తూరు గ్రామంలో నూతన సచివాలయ భవనాన్ని  ఈరోజు ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...  కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా ప్రతి సంవత్సరం రైతులకు 6 వేల రూపాయలు లభిస్తున్నాయన్నారు.

==================================

ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఓట్ల నమోదుకు సంబంధించి పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు బాపట్ల జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి రంజిత్ భాష తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఈరోజు జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిన వెంటనే ప్రవర్తనా నియమావళి అమల్లోకి వస్తుందన్నారు.

==================================

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు... వేతనాలకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా ఈ నెల 19వ తేదీన ఆయా జిల్లాల వైద్య ఆరోగ్య శాఖాధికారులకు తెలియజేయాలని ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ జె. నివాస్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఈరోజు ఒక ప్రకటన చేస్తూ... ఇది చివరి అవకాశమని స్పష్టం చేశారు.

=====================================

వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం .టి. కృష్ణబాబు.. ఈరోజు కృష్ణా జిల్లాలోని ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. మౌలిక సదుపాయాలు, సిబ్బంది అవసరాలను పరిశీలించిన ఆయన... వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం జిల్లా వైద్యారోగ్య శాఖాధికారిణి డాక్టర్ జి. గీతాబాయితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి, ప్రధానమంత్రి మాతృ వందన యోజన ద్వారా గర్భవతులకు అందుతున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

=====================================

=====================================